

టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.10 వేలు పలికాయి.



టమాట కిలో రూ.60
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.60, కనిష్టంగా రూ.40 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి

గరిష్టం/కనిష్టం
33.7°/23.4°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం బాగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

‘కూటమి’లో కుమ్ములాట!

‘కూటమి ప్రభుత్వం కొలువుదీరేందుకు కష్ట పడిన నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మీ సెల్‌కు ఓ ఎస్‌ఎంఎస్ వస్తుంది. లింక్ ఓపెన్ చేయండి. మీ ప్రాంతంలో ఎవరైతే బాగా కష్ట పడ్డారో వారి గురించి తెలియజేయండి. వారిని తగిన విధంగా గౌరవిస్తాం.’

- జిల్లాలోని పలువురు కూటమి నాయకులకు చంద్రబాబు నాయుడు గొంతుకతో వచ్చిన వాయిస్ రికార్డు కాల్ సారాంశమిది. నామినేటెడ్ పోస్టులకు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకుల నుంచి పోటీ పెరగడంతో చంద్రబాబు వేసిన ప్లాన్ ఇది.

- నామినేటెడ్ పదవుల కోసం పోటాపోటీ
- జనం మద్దతు తెలిపితేనే పదవులని చంద్రబాబు మెలిక
- ఐవీఆర్‌ఎస్ సర్వే చేయిస్తున్న వైనం
- అదంతా టీడీపీ ట్రిక్కు అంటున్న బీజేపీ, జనసేన



హిందూపురం అర్బన్: రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి కూటమి నేతలు అధికారం కోసం అర్రులు చాస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఆయా పార్టీల నేతలపై ఒత్తిడి తెస్తున్నారు. పార్టీ కోసం కష్టపడ్డామని నామినేటెడ్ పోస్టు ఇచ్చి సేవలను గుర్తించాలని ముఖ్యనేతలను డిమాండ్ చేస్తున్నారు.

షాకిచ్చిన చంద్రబాబు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నామినేటెడ్ పోస్టులపై కన్నేసిన కూటమి నేతలకు సీఎం చంద్రబాబు షాకిచ్చారు. ముఖ్యంగా బీజేపీ, జనసేన నేతలకు మింగుడుపడని మాట చెప్పారు. నామినేటెడ్ పదవుల కేటాయింపు కోసం సరికొత్త విధానం అమలు చేస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ సీట్ల కేటాయింపులో అవలంబించిన ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సర్వే (ఐవీఆర్‌ఎస్) పద్ధతి పాటిస్తున్నారు. పదవుల కోసం కూటమి నేతల్లో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో ఈ సర్వే చర్చనీయాంశమైంది. కూటమి అధికారంలోకి వస్తే తప్పక నామినేటెడ్ పదవులు వస్తాయని భావించి ఆయా పార్టీల నేతలను నమ్ముకుని వారి వెంట తిరుగుతూ పోస్టుల కోసం పైరవీలు చేసిన నేతల ఆశలపై నీళ్లు పోసినట్లయ్యింది.

ఐవీఆర్‌ఎస్ సర్వే పాస్ అయితేనే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అహుడా, కదిరిలోని ఖాద్రీ ఆలయ, కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి, లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాల పాలక మండలి చైర్మన్‌పోస్టులతో పాటు పాలక మండలి సభ్యుల పోస్టుల కోసం కూటమి నేతల నుంచి పోటీ బాగా పెరిగింది. అలాగే కార్పొరేషన్‌ల అధ్యక్ష, సభ్యులతో పాటు అనంతపురం, హిందూపురం మార్కెట్ యార్డుల చైర్మన్‌ల పోస్టుల కోసం అటు టీడీపీ నేతలు, ఇటు జనసేన పార్టీ నాయకులు తమకంటే.. తమ కంటూ పోటీ పడుతున్నారు. కానీ ఐవీఆర్‌ఎస్ సర్వే ఆధారంగానే నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని చంద్రబాబు ఇప్పటికే తేల్చేసినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో టచ్‌లో ఉన్న నాయకులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు.

ఐవీఆర్‌ఎస్ అంతా టీడీపీ కుట్ర

కేవలం తమ వాళ్లకు పోస్టులు కట్టబెట్టేందుకే సీఎం చంద్రబాబు ఐవీఆర్‌ఎస్ సర్వే పేరుతో కుట్ర చేస్తున్నారని బీజేపీ, జనసేన పార్టీ నేతలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఐవీఆర్ ఎస్ సర్వే ఫలితం బహిరంగం చేయరని, అందువల్ల టీడీపీ నేతలకే ఎక్కువ అవకాశం ఉంటుందని వారు భావిస్తున్నారు. ఎన్నికల ముందు ఒకలా... అధికారంలోకి రాగానే మరోలా వ్యవహరించడం చంద్రబాబుకు కొత్తకాదని అంటున్నారు. ఐవీఆర్‌ఎస్ సర్వే ఆధారంగానే నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టనున్న నేపథ్యం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు సైతం తలలు పట్టుకుంటున్నారు. నమ్ముకున్న వారికి ఎలా న్యాయం చేయాలని ప్రశ్నిస్తున్నారు.

మూడు పార్టీల నుంచి పోటాపోటీ

- ఇటీవల ఎన్నికల్లో తాను రూపాయి ఆశించకుండా పనిచేశానని, తన సేవలకు గుర్తింపుగా అహుడా (అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ పోస్టు ఇప్పించాలని హిందూపురానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఎమ్మెల్యే బాలకృష్ణను కోరారు. అయితే అనంతపురానికి చెందిన జనసేన నాయకుడు, కదిరికి చెందిన బీజేపీ నాయకుడూ ఆ పోస్టు కోసం భారీగా మంత్రాంగం నడుపుతున్నారు.
- ఆప్కో చైర్మన్ పోస్టు కోసం ధర్మవరానికి చెందిన ఓ నాయకుడు మంత్రి సత్యకుమార్‌పై ఒత్తిడి తెస్తున్నారు. కానీ అదే పోస్టు కోసం హిందూపురానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.
- కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు చైర్మన్ పోస్టు కోసం బీజేపీకి చెందిన ఓ ముఖ్య నేత స్థానిక ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్నాడు. అదే విధంగా కదిరికే చెందిన మరికొందరు టీడీపీ, బీజేపీ నాయకులూ ఆలయ కమిటీ చైర్మన్ పోస్టు కోసం పట్టుబడుతున్నారు. మరికొందరు హిందూపురం ఎంపీ పార్థసారథి ద్వారా ఒత్తిడి తెస్తున్నారు.
- లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ బోర్డ్ చైర్మన్ పదవి కోసం బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు పట్టుబడుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే బాలకృష్ణ వద్ద పంచాయితీ పెట్టారు. హిందూపురానికి చెందిన బీజేపీ నాయకుడు ఒకరు ఆ పోస్టు తనకు ఖాయమైందని, త్వరలోనే ప్రకటన వెలువడుతుందని ధీమాగా చెబుతున్నారు.

న్యూస్‌రీల్

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ బాధ్యతల స్వీకరణ



ఇన్‌చార్జ్ వీసీకి అభినందనలు తెలుపుతున్న రెక్టార్, రిజిస్ట్రార్ తదితరులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ బి.అనిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.మునినారాయణప్ప, డాక్టర్ కె.అనిత, ఎస్ఈ వి.మధుసూదన్‌రెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ ప్రభాకర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ పురోభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. తనను నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశం

హిందూపురం: మున్సిపల్ కార్యాలయంలో కొందరు అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారించాలని మున్సిపల్ ఆర్డీ ఆదేశించారు. ఈ మేరకు విచారణాధికారిని సైతం నియమించారని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని అకౌంట్స్ విభాగంలో చోటుచేసుకున్న అవినీతిపై ఇప్పటికే చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు ఏసీబీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పలు పత్రికల్లోనూ కథనాలు రావడంతో స్పందించిన మున్సిపల్ ఆర్డీ పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారని కమిషనర్ వెల్లడించారు. విచారణ అధికారి పూర్తిస్థాయిలో విచారించి పూర్తి నివేదికను నేరుగా ఆర్డీకి సమర్పిస్తారన్నారు. ఆ నివేదిక ఆధారంగా సదరు మున్సిపల్ అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా సంపత్‌కుమార్



అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్ఈగా సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సీఎండీ సంతోషరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి సీఎండీ కార్యాలయంలో ఈఈ (ఎంక్రైవీ) విభాగంలో పని చేస్తున్న సంపత్ కుమార్‌కు ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ అనంతపురం బదిలీ చేశారు. ఇక్కడ ఎస్ఈగా పని చేస్తున్న సురేంద్రను సీఎండీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సంపత్‌కుమార్ గతంలో అనంతపురం డీఈగాను, ట్రాన్స్‌ఫార్మర్ల విభాగంలోను పని చేశారు.

ఒక్క రోజులోనే 10 టీఎంసీలు

- శరవేగంగా టీబీ డ్యాంలోకి చేరుతున్న వరద నీరు



వరద నీటితో కళకళలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్: భారీ వరదలతో తుంగభద్ర జలశయానికి ఒక్క రోజులోనే 10 టీఎంసీల నీరు వచ్చి చేరింది. శుక్రవారం ఉదయం 1,08,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గురువారం 46.802 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, శుక్రవారం ఉదయానికి అది 55.972 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్‌మంగళూరు, వరనాడుడలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీందో వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1618.03 అడుగులకు చేరింది. ఈ ఏడాది హెచ్చెల్సీ ఆయకట్టులో వరి, మిరప సాగు చేసేందుకు రైతులు ఇప్పటికే బోరు బావుల కింద నారుమడులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు.

22 నుంచి హెచ్చెల్సీకి నీరు

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల ముహూర్తం ఖరారైంది. ఈ నెల 22 నుంచి నీటి విడుదలకు బోర్డు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కర్ణాటక కూడా ఇండెంట్ ఇవ్వడంతో ఇరు రాష్ట్రాలకు నీటిని విడుదల చేయనున్నారు. 22వ తేదీన 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నారని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. క్రమంగా నీటిని పెంచుకుంటూ పోతారన్నారు. ఈ నెల 24 తేదీకి జిల్లాలోకి తుంగభద్ర జలాలు ప్రవేశిస్తాయని చెప్పారు.

కాలువల పరిశీలన

నీటి విడుదల ఖరారైన నేపథ్యంలో శుక్రవారం తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, మునీరాబాద్ ఎస్ఈ బసవరాజు, సెక్రటరీ ఓఆర్ రెడ్డి తదితరుల కాలువలను పరిశీలించారు. జలాశయం వద్ద నుంచి జిల్లా సరిహద్దు వరకూ అధికారుల బృందం పర్యటించింది. ఎక్కడైనా ఇబ్బందులున్నాయా? ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

చివరి దర్శనం.. పోటెత్తిన భక్తజనం

- ఘనంగా కాశీం స్వామి జార్తాల్ వేడుక




కాశీం స్వామిని చూపుతున్న ముజావర్లు

బత్తలపల్లి: బొప్పేపల్లి కాశీంస్వామి చివరి దర్శనం కోసం జనం పోటెత్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలి రావడంతో బత్తలపల్లి జన సాగరమైంది. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బత్తలపల్లి, పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, మాల్యవంతం, వెంకటగారిపల్లి, అనంతసాగరం, సంజీవపురం తదితర గ్రామాల్లోనూ పెద్దకాశీం స్వామికి జార్తాల్(దినాలు)ను ఘనంగా నిర్వహించారు. ఖాశీం స్వామి చివరి దర్శనం అనంతరం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, కాశీంవలి, నజరుల్లా ప్రార్థనలు చేసి ఆలయంలోని అటకమీద భద్రపరిచారు.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ప్రశాంతి నిలయం
- ముఖ్య అతిథిగా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



సత్యసాయి మహాసమాధి (ఫైల్)

ప్రశాంతి నిలయం: గురుపౌర్ణమి వేడుకలకు ప్రశాంతి నిలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే వేడుకల కోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం సత్యసాయి మహా సమాధి చెంత జేపీ జయంత్ బృందం సంగీత విభావరి నిర్వహించనుంది. ఆదివారం ఉదయం సత్యసాయి సన్నిధిలో ‘గురువందనం’ కార్యక్రమంతో వేడుకలు ప్రారంభమవుతాయి. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండే ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి ‘దివ్యాంజన్ సేవ’ పేరుతో దివ్యాంగులకు సేవలందించే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం ముఖ్య అతిథి, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సందేశం వినిపిస్తారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసులు రంజనీ, గాయత్రి బృందం సంగీత విభావరి ఉంటుందని సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



రొళ్లలో వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కే.ఎన్.నరసయ్య

- డీఆర్‌డీఏ పీడీ కేఎన్ నరసయ్య

రొళ్ల: మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని డీఆర్‌డీఏ పీడీ కేఎన్ నరసయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో మడకశిర ఏరియా క్లస్టర్ డీపీఎంలు కె.రామిరెడ్డి, పి.రామ్మోహన్ తదితరులతో కలిసి ఏపీఎంలు, సీసీలు, వెలుగు అకౌంటెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ, ప్రాజెక్ట్ ప్రగతి కార్యక్రమంలో భాగంగా లోకోస్, లక్ పతి దీదీ, స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి తదితర పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పీఎంఈజీపీ గురించి వివరించి ఆగస్టు 15వ తేదీ లోపు ఒక్కో సీసీ కనీసం ముగ్గురు మహిళలను పీఎంఈజీపీ రుణాలకు ఎంపిక చేయాలన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ఇతరాత్ర వాటి ద్వారా తీసుకున్న రుణాలు ప్రతి నెల సక్రమంగా వడ్డితో కలిపి చెల్లించే విధంగా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి సంఘాల పనితీరు, అభివృద్ధిపై సమీక్షించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఏసీ నాగరాజు, ఏపీఎంలు స్వర్ణ, పద్మావతి, ఎస్.లలిత, పి.లలిత, స్త్రీనిధి ఏజీఎం వేణుగోపాల్, శ్రీనిధి మేనేజర్ నరేష్, ఎల్‌సీ సీసీలు ఆంజనేయులు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఏపీఎంలు, సీసీలు

జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపుదాం

- కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుదామని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏపీఐఐసీ, పరిశ్రమలశాఖ, చేనేత జౌళి శాఖ, పర్యాటక శాఖ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పరిశ్రమల స్థాపనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల లబ్ధి పొందే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారానే ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పీఎంఈజీపీ పథకం వివరాలు, ఏపీఐఐసీకి సంబంధించి భూ సేకరణ, ఖాళీ ప్లాట్ల వివరాలపై చర్చించారు. అలాగే జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అన్ని విధాలా తీర్చిదిద్దాలన్నారు. పర్యాటక శాఖకు చెందిన ఆస్తులు 14 ప్రాంతాల్లో ఉన్నాయని, అందులో 11 ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఆదాయ మార్గాలనూ అనే పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. చేనేత శాఖకు సంబంధించి ముద్ర, క్లస్టర్ రుణాలు, పింఛన్లు, శిక్షణ, జాకార్డ్ వీవింగ్‌పై శిక్షణ, రాయితీలు, మార్కెటింగ్, ఆప్కోకు ప్రోత్సాహకాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు పని తీరు మెరుగు పరుచుకోవాలని, చిత్తశుద్ధితో పథకాల అమలు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఐఐసీ జెడ్‌ఎం సోని, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, జౌళిశాఖ అధికారి రమేష్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జయకుమార్ తదితరులు ఉన్నారు.

వారంలో ‘ఉపాధి’ నిధుల జమ

- కూలీలతో కలెక్టర్ టీఎస్ చేతన్



లేపాక్షిలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా తవ్విన కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

గోరంట్ల/లేపాక్షి/చిలమత్తూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలి బకాయిలను వారం రోజుల్లో నేరుగా కూలీల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శుక్రవారం ఆయన గోరంట్ల, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పర్యటించారు. తొలుత గోరంట్ల మండల పరిధిలోని శింగిరెడ్డిపల్లికి వెళ్లారు. శింగిరెడ్డిపల్లి చెరువు– గోరంట్ల రావికుంట చెరువు మధ్య ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు. అదే విధంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా రైతు రామకృష్ణ సాగు చేస్తున్న మామిడి తోటను పరిశీలించారు. అనంతరం లేపాక్షిలో పర్యటించిన కలెక్టర్.. డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా స్థానిక గురుకుల పాఠశాల వెనుక వైపు రైతు రాంప్రసాద్ మూడు ఎకరాల్లో సాగుచేస్తున్న మామిడి తోటను పరిశీలించారు. అక్కడే జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం చిలమత్తూరు మండలంలోని టేకులోడు పంచాయతీ నల్లబొమ్మనపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆయా చోట్ల ఉపాధి హామీ కూలీలతో కలెక్టర్ మాట్లాడారు. రోజూ ఎన్ని గంటలు పనిచేస్తున్నారు... రోజూ ఎంత మేర కూలి పడుతోందని ఆరా తీశారు. ఇక నుంచి కూలి డబ్బులు ఎప్పటికప్పుడు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స కిట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని, పనిముట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన లేపాక్షిలోని ఏపీ టూరిజం గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కూలీలతో కలిసి గడారుతో మట్టి తవ్వారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓలు వాసుదేవ గుప్త, ప్రవీణ్ కుమార్, లేపాక్షి తహసీల్దార్ బాల నరసింహులు, ఏపీఓలు వరప్రసాద్, జ్యోతి, చిలమత్తూరు ఎంపీడీఓ రామ్‌కుమార్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.



నల్లబొమ్మనపల్లి వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

క్లుప్తంగా

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఏఎన్ఎంలు

పుట్టపర్తి అర్బన్: సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం, హెల్త్ సెక్రెటరీల సమస్యలు పరిష్కరించాలని సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సచివాలయాల జిల్లా కార్యదర్శి పరిమళ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు రామాంజనమ్మ, అమృత, సుహాసిని, జ్యోతి, అనుపమ తదితరులు జేసీ అభిషేక్‌కుమార్‌ను శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పించడంతో పాటు మార్చిన గ్రేడ్‌కు అనుగుణంగా పేస్కేల్ అమలు చేయాలని కోరారు. దాదాపు 43 రకాల యాప్‌లలో డేటాను ఎంటర్ చేయడంతో ప్రత్యక్ష విధులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అన్ని యాప్ లను తొలగించాలని సూచించారు. రెండో శనివారం సెలవు ఇవ్వాలని, హెల్త్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు చెల్లిస్తున్న తరహాలోనే తమకూ 35 సీఎల్‌లు ఇవ్వాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

అనారోగ్యంతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



కమలాకర్ నాయుడు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్/కదిరి టౌన్: అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బి.కమలాకర్ నాయుడు(35) మృతదేహానికి ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు పోలీసు లాంఛనాలతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లికి చెందిన ఆయన 2009లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఆయన అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లోని ఏజీఐ ఆస్పత్రిలో చేరారు. చికిత్సకు స్పందించక గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య ముత్యాలమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం మూర్తిపల్లిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, కటారి ఆనంద్, ఆర్ఎస్ఐ లక్ష్మీపతి, మృతుని బంధువులు పాల్గొన్నారు.

'బీటెక్' కొత్త పుంతలు

- మైనర్ డిగ్రీగా బీఎఫ్ఎస్ఐ కోర్సు
- బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరగడమే కారణం
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలుకు ఏఐసీటీఈ సిఫార్సు
- డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలతో ఇప్పటికే అమలు



అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సు స్వరూపం క్రమంగా మారిపోతోంది. కోర్సు పూర్తికాగానే జాబ్ గ్యారెంటీ కోర్సులను ఇప్పుడు ఇంజినీరింగ్‌లోనూ ప్రవేశపెడుతున్నారు. ఈ విద్యాసంవత్సరం బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)కోర్సును అందుబాటులోకి తెచ్చారు. డిగ్రీతో పాటు ఇంజినీరింగ్ సహా ఎవరైనా ఈ కోర్సును అభ్యసించే వెసులుబాటు ఉంది.

సాంకేతిక విద్యనే కాక..

పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యార్థులు ఇతర పాఠ్యాంశాలనూ అభ్యసించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బీటెక్‌లో చేరితే ఇప్పటి వరకూ కేవలం సాంకేతిక విద్యను మాత్రమే అభ్యసించేవారు. ఇకపై టెక్నికల్ సబ్జెక్టులు చదివే రోజులు పోయాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో ఉద్యోగావకాశాలు అపారంగా ఉండటంతో ఇంజినీరింగ్‌లో వీటిని ఒక మైనర్ డిగ్రీగా ప్రవేశపెట్టారు. ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) సిఫారసు మేరకు జేఎన్‌టీయూ (అనంతపురం) ఈ మార్పును అందిపుచ్చుకునేందుకు సిద్ధమైంది. అటానమస్, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలూ సైతం దరఖాస్తు చేశాయి.

సిలబస్, బోధన బాధ్యత కన్సార్షియందే:

బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో సేవలను అందిస్తున్న వివిధ అంతర్జాతీయ సంస్థలు కలసి బీఎఫ్ఎస్ఐ కన్సార్షియంగా ఏర్పడ్డాయి. ఈ సంస్థ కోర్సుకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక (సిలబస్)ను రూపొందిస్తుంది. పాఠ్యాంశాలనూ ఆ సంస్థ ప్రతినిధులే బోధిస్తారు. బీటెక్ రెండు, మూడో సంవత్సరం నుంచి నాలుగు సెమిస్టర్లలో ఈ కోర్సును చదవాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం దీనికి 18 నుంచి 20 వరకు క్రెడిట్లు ఉంటాయి. ఎంపికైన వారికి ఆయా కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ సైతం కల్పిస్తారు.

మారుతున్న ఇంజినీరింగ్ కోర్సు స్వరూపం

బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో ఉద్యోగాలు దక్కాలంటే బీటెక్ అనంతరం ఎంబీఏ తప్పనిసరిగా చదవాలి. ఎంబీఏ పట్టా ఉంటేనే ఈ రంగాల్లో ఉద్యోగావకాశాలు దక్కుతాయి. తాజాగా బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా రంగాల్లో రాణించడానికి ఇంజినీరింగ్ కోర్సుల్లోనే వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. వాస్తవానికి బ్యాంకులు, బీమా, ఇతర ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలు సజావుగా సాగేలా వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల నుంచి సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ అనుబంధ అవకాశం ఉన్న ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయా కంపెనీలు ప్రాధాన్యతనిస్తున్నాయి. వీటిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకునే వారి కెరీర్ ఉజ్వలంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలో బీటెక్‌లో బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, బీమా (బీఎఫ్ఎస్ఐ)లను మైనర్ డిగ్రీ ప్రవేశపెట్టాలని ఏఐసీటీఈ భావించింది.

విద్యార్థుల ఉన్నతికి దోహదం

మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ తదితర కోర్ బ్రాంచ్‌ల్లో చేరిన వారికి ఉద్యోగాలు మునుపటి మాదిరి వేగంగా దొరకడం లేదు. వీరికి మరిన్ని అవకాశాలను సృష్టించడానికి ఏఐసీటీఈ మైనర్ డిగ్రీ విధానాన్ని కొన్నేళ్ల క్రితమే ప్రవేశపెట్టింది. బీటెక్ మెకానికల్ చదువుతున్న వారు.. డేటా సైన్స్, ఏఐ అండ్ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీల్లో ఏదో ఒక దానిని మైనర్ డిగ్రీగా ఎంచుకోవచ్చు. సీఎస్ఈ విద్యార్థులు సైతం ఇతర బ్రాంచీలకు సంబంధించిన సబ్జెక్టులను మైనర్ డిగ్రీగా తీసుకోవచ్చు. ఈ మల్టీడిసిప్లినరీ విధానంతో ఆయా విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతోంది.

ట్రాక్‌మెన్ బలవన్మరణం

- గుర్తు తెలియని మృతదేహంగా ఖననం చేసిన జీఆర్‌పీలు
- ఎస్ఎస్ఈలను సస్పెండ్ చేయాలంటూ ట్రాక్‌మెన్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న ట్రాక్‌మెన్లతో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: ట్రాక్‌మెన్ హరి ఓమ్ నారాయణ (30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంతకల్లు డివిజన్‌లో సంచలనం రేపింది. ఈ నెల 15న గుంతకల్లు–మద్దికెర సెక్షన్‌లోని మల్లప్పగేట్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో జీఆర్‌పీ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించింది. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా గుర్తించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అనాథ మృతదేహంగా భావించి మరుసటి రోజు ఖననం చేశారు. అయితే వాట్సాప్ గ్రూప్‌లో చూసిన సహోద్యోగులు మృతుడిని హరిఓమ్ నారాయణగా గుర్తించారు. విషయం తెలుసుకున్న వందలాది ట్రాక్‌మెన్లు, ఇంజినీరింగ్ విభాగంలోని ఉద్యోగులు శుక్రవారం ఉదయం డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆందోళనకు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, మజ్దూర్ యూనియన్ నాయకుడు శ్రీనివాసశర్మ తదితరులు మద్దతు తెలిపారు.

ఆ ఇద్దరే కారణమంటూ...

గుంతకల్లులోని ఎస్ఎస్ఈ పీడబ్ల్యూ బీజీ విభాగం ఆరో గ్యాంగ్‌లో ట్రాక్‌మెన్‌గా పని చేస్తున్న బీహార్‌కు చెందిన హరిఓమ్ నారాయణ ఆత్మహత్యకు సీనియర్ సెక్షన్ ఇంజినీర్లుగా వ్యవహరిస్తున్న సంతోష్‌కుమార్, శశి కారణమంటూ ఆందోళనకారులు ధ్వజమెత్తారు. ట్రాక్‌మెన్లను చిన్నచూపు చూస్తూ వేధింపులకు గురి చేసేవారన్నారు. ఈ క్రమంలో హరిఓమ్ నారాయణను మరింత వేధింపులకు గురి చేశారన్నారు. కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేక సిక్ లీవ్‌లో ఉన్న నారాయణకు ఈ నెల జీతం అందకుండా నిలిపి వేశారన్నారు. జీతం రాకపోతే నెలా నెలా కట్టాల్సిన లోన్ ఇన్‌స్టాల్‌మెంట్‌లు పెండింగ్‌లో పడిపోతాయని అధికారుల వద్దన నారాయణ ఆందోళన వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో నారాయణ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిపారు. నారాయణ ఆత్మహత్యకు కారకులైన ఎస్ఎస్ఈలు సంతోష్‌కుమార్, శశిను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓ రైల్వే కార్మికుడిని అనాథ శవంగా పేర్కొంటూ ఖననం చేయడం దారుణమని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న డీఆర్ఎం విజయకుమార్ వెంటనే ఆందోళనకారులతో మాట్లాడారు. నారాయణ ఆత్మహత్యపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధిత కుటుంబసభ్యులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. దీంతో ట్రాక్‌మెన్లు ఆందోళన విరమించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయనే అంశంపై ప్రజలను చైతన్య పరచాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి సూచించారు. ‘బాల్య వివాహాలు అరికడదాం – ఆడబిడ్డలను కాపాడుదాం’ అనే అంశంపై మడకశిర మండలం హరేసముద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యుక్తవయస్సు రాకనే పెళ్లిళ్లు చేయడం ద్వారా బాలికలు ఎదుర్కొనే పలు సమస్యలు, సమాజంలో ఎదురయ్యే పలు సమస్యలను అమ్మాయిలు ఎలా ఎదుర్కొవాలనే అంశాలను లఘు చిత్రాల ద్వారా ప్రదర్శించారు. అనంతరం నాగమల్లేశ్వరి మాట్లాడుతూ... చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతారన్నారు. ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుందని హెచ్చరించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతే పెళ్లి ప్రయత్నాలు చేసేలా తల్లిదండ్రులను చైతన్య పరచాలన్నారు. బాల్యవివాహ నిరోధక చట్టం 2006పై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహం చేసినా... సహకరించినా.. హాజరైనా... ప్రతి ఒక్కరూ శిక్షార్హులవుతారన్నారు. ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ... సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్ర రూపం దాల్చిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుని బాలల హక్కుల పరిరక్షణకు గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ, హెచ్ఎం సునీత, సూపర్‌వైజర్ లీలావతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళను ఏమార్చి నగదు అపహరణ



బాధితురాలు లక్ష్మి

అనంతపురం: చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన మహిళను ఏమార్చి నగదు అపహరించుకెళ్లిన ఘటన అనంతపురంలో వెలుగు చూసింది. వివరాలు... గార్లదిన్నె మండలం బాటలో కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి వారం రోజుల క్రితం అనారోగ్య కారణంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేరింది. గత శనివారం ఆమెకు ఆపరేషన్ చేశారు. శుక్రవారం డిశ్చార్జ్ చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆఖరు పరీక్షగా ఎక్స్‌రేకు రెఫర్ చేయడంతో ఆమె సర్వజనాస్పత్రిలోని ఎక్స్‌రే కేంద్రం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో ఓ వ్యక్తి ఆమెను బాగా పరిచయం ఉన్నవాడిలా పలకరించాడు. తన పేరు సుబ్బరాయుడని తెలిపాడు. తన కుమారుడు సాయికి మంచి పెళ్లి సంబంధం చూడాలని కోరుతూ మాటల్లో మభ్య పెట్టాడు. ఈ క్రమంలో ఎక్స్‌రే కేంద్రంలోకి వెళుతున్న ఆమెను ఆపి డబ్బు దగ్గర పెట్టుకోకూడదని, తన చేతికి ఇచ్చి ఎక్స్‌రే తీయించుకుని వచ్చిన తర్వాత ఇచ్చేస్తానని నమ్మబలికాడు. దీంతో తన వద్ద ఉన్న రూ.8 వేలను ఆగంతకుడి చేతిలో పెట్టి ఆమె ఎక్స్‌రే తీయించుకుని బయటకు వచ్చింది. అక్కడ సదరు వ్యక్తి లేకపోవడంతో తాను మోసపోయినట్లుగా గుర్తించి అనంతపురం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నూతన రిజిస్ట్రార్ నియామకంపై ఉత్కంఠ


అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్ ఎవరు అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతమున్న రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య హోదా కాలం ఈ నెల 21న ముగియనుంది. 21న ఆదివారం కావడంతో శనివారమే ఆయన తప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో నూతన రిజిస్ట్రార్ నియామకం అనివార్యమైంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బి.అనిత గౌడ్‌ను ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. అలాగే ఓసీ సామాజిక వర్గానికి రెక్టార్ హోదాను అప్పగించారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్ హోదాను ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారనే అంశంపై వర్సిటీలో ఊహాగానాలు మొదలయ్యాయి. కాగా, సింహభాగం రిజిస్ట్రార్ పోస్టు ప్రొఫెసర్లకే అప్పగిస్తారు. బోధనేతర ఉద్యోగుల్లో డిప్యూటీ రిజిస్ట్రార్, ఆపై స్థాయి స్కేల్ తీసుకుంటున్న వారికి అప్పగించే అవకాశాలుంటాయి. తాజాగా రిజిస్ట్రార్ హోదా కోసం బోధనేతర ఉద్యోగుల్లో ఇద్దరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బోధనేతర ఉద్యోగులకు అప్పగిస్తే రమేష్ బాబు (స్టాటిస్టికల్ ఆఫీసర్), డాక్టర్ లక్ష్మీరాం నాయక్ పేర్లను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రొఫెసర్లకు అవకాశం కల్పిస్తే ప్రొఫెసర్ దాశరథి రవీంద్ర(లైబ్రరీ సైన్సెస్), డాక్టర్ ప్రభాకర్ (ఎంబీఏ విభాగాధిపతి), ప్రొఫెసర్ ఆంజనేయులు (కామర్స్) పేర్లు ప్రతిపాదనలో ఉన్నాయి. ఇన్‌చార్జ్ వీసీగా ఆచార్య బి.అనిత గౌడ్ బాధ్యతలు తీసుకున్న ఒక రోజులోనే ఆమెకు రిజిస్ట్రార్ ఎంపిక చిక్కు ఎదురైంది.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి

శింగనమల: మండలంలోని చిన్న జలాలపురంలో వైఎస్సార్ సీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి లలితా కళ్యాణి కుటుంబసభ్యులు రామలింగ, రామాంజినేయులు, వెంకటేష్, నారాయణమ్మ, లక్ష్మీదేవిపై స్థానిక టీడీపీ నాయకులు పట్నం నగేష్, ఆయన అనుచరులు దాడి చేశారు. పాతకక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ఇంటి మీదకు వచ్చి దాడి చేసినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పట్నం నగేష్, ఆయన అనుచరుల నుంచి తమ కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా పోలీసులను బండి లలితాకళ్యాణి కోరారు.

బాధ్యతగా పనిచేస్తే ఆరోపణలు ఎందుకొస్తాయి?

- డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి
- కూడేరులో సామాజిక తనిఖీ ప్రజావేదిక
- రూ.12.20 లక్షల అభియోగం.. రూ.70 వేలకు నిర్ధారణ



సిబ్బందిని నిలదీస్తున్న ఏపీడీ సుధాకర్‌రెడ్డి

కూడేరు: బాధ్యతగా పని చేస్తూ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉంటే ఆరోపణలు, సమస్యలు ఎందుకొస్తాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బందిని ఆ సంస్థ ఏపీడీ సుధాకర్‌రెడ్డి నిలదీశారు. శుక్రవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 -24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం కింద రూ.7.56 కోట్లతో కూలీలతో, మెటీరియల్‌తో చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీపై క్షేత్ర స్థాయిలో చేపట్టిన తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలను సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ బృందం చదివి వినిపించింది. హార్టికల్చర్ కింద నాటిన పండ్ల మొక్కలు చాలా మంది రైతుల పొలాల్లో లేవని, ఫారంపాండ్లు, నేమ్‌బోర్డులు సరిగా లేవని, పునాది వరకు పక్కా ఇళ్లు నిర్మించుకుంటే ఇంటిల్ లెవల్‌కు బిల్లులు చేశారని ఈ లెక్కన 14 పంచాయతీల్లో మొత్తం రూ.12.20లక్షలు దుర్వినియోగమైనట్లు అభియోగం మోపారు. దీనిపై జిల్లా అధికారులు విచారించగా అందుకు గల కారణాలను ఆధారాలతో సహ సిబ్బంది వివరించింది. దీంతో రూ.70 వేలు దుర్వినియోగమైనట్లు తేలింది. బాధ్యులైన వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ విజయలక్ష్మి, ఎంపీడీఓ విజయలలిత, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీఓ తులసీప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అక్కమ్మగార్ల జాతర



ఉత్సవ మూర్తులను పూర్వపు స్థానానికి తరలిస్తున్న పూజారి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి సమీపంలోని కొండలో వెలసిన అక్క దేవతల జాతర శుక్రవారం భక్తి శ్రద్ధలతో సాగింది. గ్రామానికి చెందిన పిచ్చల వంశీయులు ఏటా తొలి ఏకాదశి పర్వ దినం మరుసటి రోజు అక్కమ్మగార్ల జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం అక్క దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. భక్తులకు స్థానిక ప్రముఖుడు ఈశ్వరరెడ్డి అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈ రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి భజన పోటీలు

బెళుగుప్ప: గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా బెళుగుప్ప మండలం నక్కలపల్లిలోని శిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకులకు ప్రత్యేక బహుమతులు అందించనున్నారు. అలాగే పోటీలో గెలుపొందిన జట్లకు నగదు పురస్కారాలతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. వివరాలకు 99082 97598, 99086 56059, 79933 14329లో సంప్రదించవచ్చు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



మృతుడు నారాయణస్వామి

ధర్మవరం రూరల్: స్థానిక శివానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు నారాయణస్వామి(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుటుంబ సభ్యులతో కలసి మగ్గం పనులు చేస్తూ జీవనం సాగించే నారాయణస్వామి ఇటీవల చీరలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ క్రమంలో కుటుంబపోషణ, ఇతర అవసరాల కోసం స్నేహితులు, సన్నిహితుల వద్ద రూ.4 లక్షలకు పైగా అప్పులు చేశాడు. అయితే మగ్గం పనులతో స్థిరమైన ఆదాయం లేక అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నారాయణస్వామికి భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

22న జిల్లా బాలుర సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

హిందూపురం: జిల్లా బాలుర సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక ప్రక్రియ ఈ నెల 22న ఉదయం 10 గంటలకు హిందూపురంలోని ఎంజీఎం క్రీడామైదానంలో చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2011, జనవరి 1 నుంచి 2012, డిసెంబర్ 31వ తేదీ లోపు జన్మించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 4 ఫొటోలు, మెడికల్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల సమ్మతి పత్రంతో ఎంపికకు హాజరు కావాలి. పూర్తి సమాచారానికి 80995 98958లో సంప్రదించవచ్చు.

ఖర్చులు మావి.. బిల్లులు వారికా?

- ఎంఈఓ–2ల ఆవేదన

అనంతపురం ఎడ్యుకేషన్: స్టూడెంట్ కిట్ రవాణా, ఇతర పనులకు చెందిన మొత్తాన్ని మొదటి నుంచి ఈ విధులు పర్యవేక్షించిన ఎంఈఓ–2లకు వేయకపోవడం దారుణమని ఎంఈఓ–2 అసోసియేషన్ నాయకులు వాపోయారు. నగరంలో అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఎంఈఓ–1, 2ల మధ్య విభేదాలు సృష్టించేలా అసిస్టెంట్ సీఎంఓ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఈఓ–2లుగా నియమితులైన తాము అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ ప్రభుత్వ పథకాలు అమలులో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఈ క్రమంలో స్టూడెంట్ కిట్ రవాణా మొత్తం రెండు నెలల క్రితమే విడుదలైనా.. జిల్లాలో మాత్రం ఆలస్యంగా రిలీజ్ చేయడమే కాకుండా సొంత ఖర్చులతో రవాణా చేసిన ఎంఈఓ–2ల ఖాతాలకు కాకుండా ఎంఈఓ–1ల ఖాతాలకు జమ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఎంఈఓ–2ల ఖాతాల్లోనే స్టూడెంట్ కిట్ల రవాణా మొత్తం జమ చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఈఓ–2 అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు డాక్టర్ రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భవానీశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారపరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు లింగా నాయక్ , ఎంఈఓ–2లు మనోహర్, ఓబుళపతి, హరికృష్ణ, మున్వర్ బాషా పాల్గొన్నారు.